
రాంపా

# వేడుక తీర్చర వేణుగోపాలా!

కోపాల నీకు వేణుగోపాలా!

వేయారువేల వనితలు నిను వలచి వలపించి నీ చుట్టూ తిరిగి నిన్ను తమచుట్టూ తిప్పుకుంటారని నీకు గర్వం కాబోలు! వేయారు కాదులేవయ్యా పదారువేల పై చిలుకేలే కలికిచిలుకల కొలికిమణుల కోమలుల సంఖ్య

అది నీ గొప్పనుకుంటున్నావా గొల్లవాడా?

నీ నల్లని మేని సొగసులకు సొక్కి సోలిపోతున్నా రనుకుంటున్నావా వెర్రివాడా!

కాకపోతే వాడవాడకంతా నీవే పేద్ద మొనగాడివని నీ చుట్టూ పడిగాపులు పడ్తున్నారనుకుంటున్నావా పిచ్చివాడా!

కాదు! కాదంటే కాదు! ముమ్మాటికీ కాదు.

కాదన్నానని వాదేలనయ్యా నల్లనయ్యా!

వాళ్లంతా [illegible] వచ్చేది ప్రాణాలు తీసే నీ పిల్లన గ్రోవి పాటకు! తెలుసా? అది చెవుల్లో దూరి గుండెల్లో చేరి ప్రాణాలుతోడేస్తుందా పాట. ఆ బాధకు తట్టుకోలేక నీ చుట్టూ చేర్తారు. వీనుల విందుగా పసందుగా నువ్వు విన్పించే ఆ పాటకు పరవశిస్తారు. పరిగెత్తుకుని వచ్చి ప్రాణాచారం పడతారు! అర్థమైందా!

కాదు..... కాదు... నా మగసిరికే•లొంగి మరులు కొని వస్తున్నారంటావా? అయితే యీ సహాయం చేసి పుణ్యం కట్టుకో పురుషోత్తమా!

నీ వల్ల పురుడైతే నీ పేరున దీపం పెట్టి మొక్కుతుంది

ఎవరా?

ఎవరోలే! ఒక గొడ్డుబోతు! సంతానం కోసం సలసలకాగే రక్తంతో మసలుతున్నది.

పెళ్లయిందిలే! తోడుగా మగడూ ఉన్నాడు!

పాపం దాని కడుపున యింతదాకా ఒక కాయ అయినా కాయలేదు! నెల తప్పలేదు! ఏమన్నావ్! అది నీతీ తప్పలేదు. నియమంగా భర్తకే ప్రాణాచారం పడ్తూ వుంది. పడరాని పాట్లు పడుతూ వుంది. కనిపించే గుళ్లకు కనిపించని దేవుళ్లకు కనిపెంచే భాగ్యాన్ని కలిగించమని సాష్టాంగ నమస్కారాలు, పొర్లుదండలూ పెడ్తున్నది.

ఇన్నేళ్లయ్యాక యిప్పుడెందుకీ తొందరపాటంటావా? వయసనేది ఒక రసప్రవాహం! అది రోజు రోజుకు తరిగిపోతూ వుంటుంది ఆ కాస్తంత గడిచిపోయాక పుణ్యకాలం పూర్తయ్యాక వగచినా వలచినా ఫలం ఏముంటుంది?

నువ్వే చెప్పుకున్నావా లేదా! మగరాయడనని!

అందుకే ఈ వేడికోలు! విన్నపాలు!

అవునయ్యా! గొడ్డుబోతు వొకతె బిడ్డలకై నిన్ను కోరియున్నదిరా ! కోరియున్నది....రా!

గురుతు?

గుర్తు చెప్పాలా? చెప్తా విను! బాగా విను! మనసుపెట్టి విను! అమ్మాయి వర్ణన ఇది!

సడ్డి ముక్కు!

మేను నలుపు!

మాటలు నత్తి!

మడ్డి శరీరం!

మగువ బుగ్గలు సొట్ట!

అదేం! ముఖం తిప్పుకుంటున్నావ్... పెదవి విరుస్తున్నావ్! మాటలతోనే ముఖం ముడిచావు... మొఖం మొత్తిందా? మోహం దిగజారి పోయిందా?

వలరాయా! ఓ వేణుగోపాలరాయా!!

అది అందగత్తె అవునో కాదో..... కళ్లారా చూడు

అప్పుడు తెలుస్తుంది నీకు! ఆ కామిని కనుల నుండి జాలువారే ప్రేమలో మునిగి ఈతలు కొట్టి ఆపై సొక్కి సోలిపోతావు దేవరాయా!

అక్కడికి వెళ్లాలంటే నువ్వేం కష్టపడక్కర్లేదు!

సాని యింటికిలా - నేటికి నీ వీటికి వస్తున్నానని నీ వేరికి తాంబూలం యివ్వద్దని తాంబూలం పంపక్కర్లేదు.

లక్షలు వేలు వరహాలసొమ్ము వద్దే వద్దు!

దానికి నీ ముద్దే పెద్ద పద్దు! నీ మురిపెమే మరీ పెద్ద పద్దు! కట్టుకోడానికి రంగు రంగుల చీరలు యిదిగో పట్టు అని పంపక్కర్లేదయ్యా, కట్టు తప్పించి వాడకట్టులో గౌరవం నిలిచేలా కన్నతల్లిని చేస్తే చాలు! చాలంటే చాలు! అంతే! చాలు మొదలయ్యేక కన్నపిల్లల చూస్తూ కడుపు పండినందుకు గంపెడంత

సంతానం కలిగినందుకు కడుపార సంతసిస్తుంది.

మళ్లీ వినవయ్యా మగరాయడా!

పక్కలాకులు వద్దు... వరహాలంబదు...

సొమ్ము లెక్క సేయదు...

చీరలక్కరలేదు

కక్కస గాండ్లెల్ల కాదని తొలగిరి

దక్కితిని అడుగుదండాలు పెట్టుచు.....

అవునయ్యా! అది నీ కోసం మీదుకట్టుకుని లేదులే! కానీ నీ కోసం ప్రాణాలు మీదుకట్టుకుని వుంది!

గంధమా !

ఎందుకయ్యా మాధవా? అక్కడ పూలు విరగబూసి వున్నాయి. నువ్వేం తీసికెళ్లక్కర్లేదు.

అన్నట్టు విటరాయా! ఓ విశేషం వుంది! చెప్పనా? చెబ్తా ! చెవులు దోరపెట్టుకుని విను! విసువిను!

అబ్బ! ఎందుకా తొందర! చెబ్తాగా!!

మడ్డీ మనిషైనా - నడ్డిముక్కయినా - సత్తివున్నా - నల్లని మేని దయినా - సొట్టబుగ్గలయినా - సోగకళ్ల సోయగాలు తక్కువైనా - ఎన్నదగిన విషయం ఒక్కటుందయ్యా! ఒక్కటే అయిన కోటిగుణాల కోవలో ఎన్నదగిందది.

అదేమిటా?

మందయానకు నేడు మారునీళ్లు....

మరునీళ్లతో తానాలాడినట్టుంటుందని కదయ్యా వలపువేదాల వేత్తల వాక్యం!

అదిగో... విటధర్మం తెలిసిన నీకు మారునీళ్లనాటి మందయాన మజా తెలీదా ఏం?

తెలుసు కాబట్టే ఆ చూపుల్లో తొందర!

ఆ కళ్లల్లో కాంక్ష!

ఆ అందగత్తె విడిది అదిగో!

ఓ తేరకాడా ! ఆమె సుందరంగా వాదుచుక్క దిద్దింది! నీ కోసం ముఖాన శ్రీకారం చుట్టా నన్నట్టుగానేలే!

ఇవన్నీ కాక యింకేం విశేషాలున్నాయంటావా? స్వామీ.

రాణివాసం లేదు....

దొరలాగా రమ్మనగానే రావచ్చు...... పోవచ్చు...

అడ్డులేదు... ఆపూ లేదు.

ఇవన్నీ ఒకెత్తు సామీ!

ఇంకో విషయం విశేషం వుంది సుమీ!

పాపం ఆ భామామణికి నువ్వంటే ప్రాణం! నీ మీదే ప్రాణం! ఎందుకన్నట్టుగా ఏమిటా కనుబొమల ముడి?

నువ్వీ రాత్రికే వస్తావని... ఈ రాత్రి వసంతరాత్రి అయి యిక ప్రతిరాత్రీ పరువాల పున్నమి అయి.... ఆ భామామణి నీకు వేకటి అయ్యేనని!

సిగ్గులు చిందులువేస్తూ వుంటే -

వయ్యారాలు వొలకబోస్తూ వుంటే.........

సోయగాలు సొమ్మై....

జాణతనాలు కానుకలై......

కలయికలే కాముని పున్నమి వేడుకలై.....

విటరాయడి చేతిలో విల్లులా సొంపుల వంపులు తీరాలని తపించే ఆ భామామణిని యీ రాత్రికే ఏలుకోవయ్యా సామీ! కదలుతున్నావా కడలంత కాంక్షలతో...

ధన్యోస్మి.....

(సారంగపాణి పదమాధురి ఆధారంగా)

* * *